క్లుప్తంగా

కాకినాడ అర్చకులకు ఎమ్మెల్యే విష్ణు పరామర్శ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజహితం కోరే పురోహితులు, అర్చకులంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అపార గౌరవ మర్యాదలు ఉన్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కాకినాడ శివాలయ ఘటనలో బాధిత అర్చకుడు వెంకటసత్యసాయి, ప్రధాన అర్చకుడు కార్తీక్‌లను గురువారం ఆయన ఫోనులో పరామర్శించారు. అర్చకులకు ఎటువంటి అన్యాయం జరిగినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఇప్పటికే దీనిపై స్థానిక ఎమ్మెల్యే, రీజనల్ జాయింట్ కమిషనర్, ఈఓలతో మాట్లాడినట్లు తెలిపారు. అర్చక వ్యవస్థ పట్ల ప్రతి ఒక్కరూ గౌరవ భావం కలిగి ఉండాలని, వారిపట్ల దాడికి తెగబడే వారు ఎవరైన పార్టీలకు అతీతంగా తమ ప్రభుత్వం స్పందిస్తుందని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, పురోహితుల హక్కులను కాపాడే విధంగా కఠిన చట్టాని తీసుకురావాలని, ఈ అంశాలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత పురోహితులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

నాగమల్లేశ్వరికి గౌరవ డాక్టరేట్



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురానికి చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లేశ్వరికి హోప్ థియాలజికల్ యూనివర్సిటీ, ఢిల్లీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎంపీ వేణుగోపాలచారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చంద్రవదన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ బెస్ట్ సోషల్ సర్వీస్ పురస్కారం అందుకున్నారు. నాగమల్లేశ్వరి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గానూ గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ట్రస్ట్ సభ్యులు షేక్ షఫీవుల్లా, డాక్టర్ బీ వసంతకుమార్, రహీమ, హేమంత్‌రావు, సరస్వతి తదితరులు నాగమల్లేశ్వరిని అభినందించారు.

యువతి అదృశ్యంపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యంపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేదారేశ్వరపేట, రెండో లైన్‌లో యువతి కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటుంది. ఆమె డిగ్రీ రెండో సంవత్సరం వరకు చదువుకుని ఇంట్లోనే వీడియో ఎడిటింగ్ పనులు చేస్తుంటుంది. ఈ క్రమంలో బుధవారం ఆమె తల్లి ఊరు వెళ్లగా ఇంట్లో యువతి, ఆమె అక్క, తమ్ముడు ఉన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యువతి కనిపించకపోవడంతో ఆమె అక్క చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి గత కొంతకాలంగా గుంటూరుకు చెందిన యువకుడితో తరచు ఫోన్‌లో మాట్లాడుతుంటే తల్లి మందలించేదని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చిత్రలేఖనంతో మానసిక ప్రశాంతత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిత్రలేఖనం మానసిక ప్రశాంతత, ధైర్యంతో పాటు మనో నిబ్బరాన్ని ఇస్తుందని ప్రముఖ చిత్రకారుడు లయన్ పి.రమేష్ అన్నారు. కేటీరోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో గురువారం స్కూల్ కరస్పాండెంట్ రాజు డేవిడ్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ చిత్రకారుడు లయన్ పి.రమేష్ , క్లబ్ కార్యదర్శి లయన్ పి.జె. సుధాకర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చిత్రలేఖనంతో జీవితంలో మంచి ఆర్టిస్టుగా స్థిరపడటంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను సైతం పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనంలో పలు మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతికి పంచామృత అభిషేకాలు

యాగశాలలో హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై గురువారం గణపతికి ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ వైదిక కమిటీ సభ్యుడు యజ్ఞనారాయణ శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు గణపతి ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం గణపతి మంత్ర హవనం(హోమం)ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపించారు. స్వామి వారి అభిషేకాలు, పూజా కార్యక్రమాలలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. హోమం అనంతరం ఉభయదాతలు, భక్తులకు ఆశీర్వచనం అందజేసి, ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



25వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఐదేళ్లు పని చేసిందని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 25వ డివిజన్‌లో గురువారం ఆయన పర్యటించారు. డివిజన్‌లోని దుర్గా అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలదేవితో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వ హయాంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డివిజన్‌లో ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరిందన్నారు. తాము ప్రతి ఇంటికీ వెళుతుంటే సంక్షేమ పథకాల లబ్ధి తమకు చేకూరిందని ప్రజలే స్వయంగా చెబుతున్నారన్నారు. తాము సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేస్తామని ముక్తకంఠంతో చెబుతున్నారని తెలిపారు. అవ్వ తాతలు మళ్లీ జగనే సీఎం కావాలని దీవిస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల ద్వారా లబ్ధిచేకూర్చామని వెల్లడించారు. సంక్షేమ పథకాలు అందుకున్న పేదలంతా సంతోషంగా ఉన్నారన్నారు. డివిజన్ పరిధిలోని దోబీ ఖానా అభివృద్ధి చేయాలని స్థానికులు వెలంపల్లిని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఎన్నికలు అయిన వెంటనే అభివృద్ధి చేయిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీకి మరోసారి అధికారం కట్టబెట్టాలని కోరారు.

బొండా ఉమాకు ఎందుకు ఓటు వేయాలి..

బొండా ఉమా ఓ తాగుబోతు అని ఎమ్మెల్యే వెలంపల్లి విమర్శించారు. తాగి కళ్లజోడు పెట్టుకుని చూయింగ్ గమ్ నములుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి లక్షణాలు ఉన్న వ్యక్తి ప్రజలకు అవసరమా..? అని ప్రశ్నించారు. గతంలో ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బొండా ఉమా నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఉమాకు ఎందుకు ఓటు వేయాలని ప్రజలే ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇకనైనా బొండా ఉమా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు కాటకాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కోసూరి సుబ్రహ్మణ్యం, 25వ డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో గురువారం కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అనుక్షణం ప్రజలతోనే కలిసి ఉంటామని వారి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తామని అన్నారు. బొండా ఉమా మందు సేవించకుండా బయటకు రాడని, భూకబ్జాలు, రౌడీయిజానికి కేరాఫ్ అని అన్నారు. అటువంటి బొండాను ఎన్నికల్లో ఓడించి రాజకీయ సన్యాసం చేయించాలని పిలుపునిచ్చారు. తాము నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. తమ భవిష్యత్తు జగన్ అని ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తామంటూ ప్రజలంతా నినాదం చేస్తున్నారని పేర్కొన్నారు.



29వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

చంద్రబాబు మీటింగ్‌లకు స్పందన కరువు

చంద్రబాబు మీటింగ్‌లకు స్పందన కరువు అయిందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రజలు సీఎం జగన్ సభలకు వేలాదిగా స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని వెల్లడించారు. బొండా ఉమా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో 29వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



62వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిరువ్యాపారికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ విజ్ఞప్తి చేశారు. వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 64వ డివిజన్ కండ్రిక కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని వివరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే మన వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించుకుందాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, మీసాల రామకృష్ణ, కోటి, లక్ష్మణ, మాతా సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

62వ డివిజన్‌లో..

స్థానిక 62వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏపీఎస్‌రెడ్డి రోడ్డు 62వ బూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో నగర వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, నాయకులు బోరా బుజ్జి, సీహెచ్ రామిరెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్, డివిజన్ ఇన్‌చార్జి షేక్ మస్తాన్, పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ హైమావతి, సుభాని, సావిత్రి పాల్గొన్నారు.

రేపు రన్ ఫర్ జీసస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రైస్తవ సంఘాలు శనివారం సమైక్యంగా నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐక్యవేదిక నాయకులు యుద్దనపూడి పవన్‌కుమార్, అమృతపూడి కార్తీక్ కోరారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. శనివారం ఉదయం 6 గంటలకు, ఆర్‌సీఎం సెయింట్ పాల్ కేథడ్రల్ నుంచి ప్రారంభమై, సిద్ధార్థ పాలి క్లినిక్ రోడ్, మదర్ థెరిస్సా సర్కిల్, ఉడ్ పేట, శిఖామణి సెంటర్, గిరిపురం మీదుగా సాగి సీఎస్ఐ సెయింట్ పాల్స్ బసిలికా వరకు రన్ ఫర్ జీసస్ ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు.

స్పా, బ్యూటీ పార్లర్లలో తనిఖీలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు కొత్తపేట పోలీసులు గురువారం స్టేషన్ పరిధిలోని స్పా, బ్యూటీ పార్లర్లు, మెన్ సెలూన్‌లలో తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ పి.మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో కొత్తపేట సీఐ టి.గణేష్ తనిఖీలలో పాల్గొన్నారు. సుబ్బరామయ్య వీధి, కొత్తపేట, కోమలవిలాస్, నెహ్రూ బొమ్మ సెంటర్, టైలర్‌పేట, పంజా సెంటర్, కేటీ రోడ్డు పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు. స్పా, సెలూన్ల ముసుగులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించరాదని హెచ్చరికలు జారీ చేశారు.

పన్ను బకాయిలను 31లోపు చెల్లించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ కాలపరిమితి ఈ నెల 31వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను వసూలు కేంద్రాలు సెలవు దినాల్లో కూడా ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు




సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రచురణకర్తలకు సెంట్రల్ రిటర్నింగ్ అధికారి హెచ్చరిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించే ప్రింటర్లు, పబ్లిషర్లపై కఠిన చర్యలు తప్పవని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్/మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్‌తో కలిసి ఎన్నికల నియమావళిని అనుసరించాల్సిన అంశంపై సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రింటర్స్/పబ్లిషర్స్ యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. పాంప్లెట్లు, పోస్టర్లు ముద్రించే విషయంలో పాటించాల్సిన నిబంధనలు, ఎన్నికల నియమావళి ప్రకారం ఎంసీసీ 127(ఎ), ఆంధ్రప్రదేశ్ డిస్ ఫిగర్‌మెంట్ ఆఫ్ ఓపెన్ ప్లేసెస్, ప్రొహిబిషన్ ఆఫ్ అబ్జక్షనబుల్ పోస్టర్స్ యాక్ట్ 1997, ప్రకటనలు ముద్రించే యజమానుల నుంచి తీసుకోవాల్సిన అండర్ టేకింగ్‌ల గురించి వివరించారు. ఇకపై పాంప్లెట్లు, పోస్టర్ల వంటి ఎన్నికలకు సంబంధించినవి ముద్రించేటప్పుడు ప్రింటర్ల చిరునామా/ఫోన్ నంబర్, ముద్రించుకునే యజమానుల చిరునామా/ఫోన్ నంబర్ ముద్రించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్రీడీ పరిజ్ఞానంతో విద్యాబోధన



ప్రత్యేకంగా తయారు చేసిన లాప్‌ట్యాప్‌తో పాటు జడ్‌వ్యూ కెమెరా

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో నూతన ఆధునిక పరిజ్ఞానంను వినియోగించి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధ ఆధారంగా నూతన విద్యాబోధన పద్ధతులు ప్రవేశపెట్టారు. అమెరికాకు చెందిన జడ్‌స్పేస్ ఇండియా వారు వివిధ పాఠ్యాంశాలను త్రీడీ అనుభూతిని పొందేలా వీడియోలు, మోడళ్లను రూపొందించారు. ఈ పద్ధతిలో ఏఆర్(అగ్మెంటెడ్ రియాలిటీ) వీఆర్(వర్చువల్ రియాలిటీ)లో విద్యాబోధన జరుగుతుంది. దీనిలో ప్రత్యేకంగా తయారు చేసిన లాప్‌ట్యాప్‌తో పాటు జడ్‌వ్యూ కెమెరాను అమర్చి విద్యార్థులే నేరుగా వివిధ పాఠ్యాంశాలను ప్రత్యేక కళ్లజోడు అవసరం లేకుండా త్రీడీ పద్ధతిలో చూస్తూ అభ్యసించడం జరుగుతుంది. అన్నీ త్రీడీ పద్ధతిలో చేయడం వల్ల విద్యార్థుల్లో అభ్యసనపై ఆసక్తి పెరుగుతుంది. వీడియోలు, ఇతర మోడళ్లను కృత్రిమ మేధ ఆధారంగా జడ్‌స్పేస్ వారు తయారు చేసి కళాశాలకు అందజేశారు.

కార్మిక పక్షపాతి సీఎం జగన్



మధురానగర్(విజయవాడ సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతి అని వారి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం ఫుడ్ జంక్షన్ సమీపంలో గురువారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. అహర్నిశలు పేద బడుగు బలహీన, కార్మికుల కోసం శ్రమిస్తున్న జగనన్నకు యావత్ కార్మిక లోకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జోనల్ ఇన్‌చార్జి ప్రదీప్, నగర అధ్యక్షుడు విశ్వనాథరవి, పార్టీ మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి లఖంరాజు సునీత, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఆటో యూనియన్ సభ్యులు, ట్రేడ్ యూనియన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య హేమచంద్రారెడ్డి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని మరింత సమర్థవంతంగా ఎదగాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్రారెడ్డి అన్నారు. కేబీఎన్ 59వ వార్షిక వేడుకలు కళాశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యారంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు విద్యావిధానంలో అనేక నూతన మార్పులను తీసుకొచ్చామన్నారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమలోని నైపుణ్యాలను పదును పెట్టుకుని ముందుకు సాగినప్పుడు జీవితంలో చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సింగిల్ మేజర్ సబ్జెక్ట్ వంటి అనేక సంస్కరణలను అమలు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ వెస్ట్‌జోన్ డీసీపీ టి.హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయటానికి పాటుపడాలన్నారు. మిజోరాం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాధిపతి ఆచార్య దివాకర్ తివారి మాట్లాడుతూ కళాశాల సాధిస్తున్న విజయాలను అభినందించారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు టి.శేషయ్య, తునికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 118 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల 59 సంవత్సరాలుగా సామాజిక వికాసానికి పాటుపడుతోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో కళాశాల సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సహాయ కార్యదర్శి జీవీ రామారావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, హిందూ హైస్కూల్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందించారు.

మాయ కూటమికి బుద్ధి చెబుదాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): దళితులకు తీరని అన్యాయం చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ అవహేళన చేసి మాట్లాడారని, ఇప్పుడు ఓట్ల కోసం మాయమాటలు చెపుతున్నాడంటూ మండిపడ్డారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార దాహంతో ఒక మాయా కూటమి ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో ఆ కూటమికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతి దళితుడిపై ఉందన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ చంద్రబాబు గారడీ మాటలు చెబుతూ ప్రజల్లోకి వస్తున్నారని, ఆయనను నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. దళితుల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పేదలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టారని, పేదలు వెళ్లే ప్రభుత్వాస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. నాణ్యమైన విద్య, వైద్యంతో ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. దళితులంతా ఐక్యంగా బాబుకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

బీఆర్టీఎస్ రోడ్డులో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో పౌరులు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా పోలీసులు అవగాహన కల్పిస్తు గురువారం బీఆర్టీఎస్ రోడ్డులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టికె.రాణా ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ దేవర కొండ ప్రసాద్, ఎస్ఎన్‌పురం సీఐ వెంకటనారాయణ, అజిత్‌సింగ్‌నగర్ సీఐ గురుప్రకాష్, ఉమెన్ ఎస్ఐ దుర్గాభవానీల ఆధ్వర్యంలో సివిల్, ఏపీ ఎస్పీ, పారామిలటరీ బలగాలు కవాతు చేశారు. బీఆర్టీఎస్ రోడ్డులోని శారద కళాశాల జంక్షన్ నుంచి బావాజీపేట, దుర్గాపురం, విష్ణునగర్ కాలనీ, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేసి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడంలో పోలీసులు అండగా ఉంటారని ప్రజలకు బరోసా కల్పించారు.

వైభవంగా భగవద్విషయ సమాపన మహోత్సవం



లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం భగవద్విషయ సమాపన మహోత్సవం జరిగింది. కార్యక్రమాన్ని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి శిష్యులు శ్రీ అష్టాక్షరీ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచినజీయర్ స్వామి శిష్యబృందం అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం శ్రీ అష్టాక్షరీ జీయర్ స్వామి మాట్లాడుతూ చారిత్రాత్మకమైన విజయవాడ నగరంలో ఎన్నడూ జరగని ఆధ్మాత్మికమైన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. భగవంతుని గురించి చెప్పడానికి నియమం లేదని, ఎవరైనా చెప్పవచ్చు, వినవచ్చునన్నారు. ఆచరించే వారు శాస్త్రబద్ధమైన ఆచరణ విధానాన్ని అనుసరించాలన్నారు. భగవద్విషయం అనేది సమాపన ఉత్సవం అని, విశిష్టాద్వైత సంప్రదాయాలలో ఉద్గ్రంథమని, 1102 పాశురాలతో ఉండే గ్రంథమని వివరించారు. అనంతరం నిర్వాహకురాలు పసుపమర్తి పద్మజకుమారి మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ జరగని విధంగా యతిరాజనాథవల్లి గోష్ఠి జరిగిందన్నారు. సంస్కృతంలో ఉన్న వేదాలను నమ్మాళ్వారు తమిళంలో అనుగ్రహించారన్నారు. అందులో సామవేదానికి సమానమైన తిరువాయ్‌మొళి దివ్య ప్రబంధం అని, ఆ ప్రబంధాన్ని మూడు సంవత్సరాలుగా యతిరాజనాథవల్లి గోష్ఠివారు ఆన్‌లైన్ విధానంలో నేర్చుకున్నారన్నారు. ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు.